సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 10 । మే । 2025



రండి.. డిగ్రీలో చేరండి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) రిజిస్ట్రేషన్ల షెడ్యూల్ విడుదలైంది. 10లో



తునికాకు సేకరణ షురూ..

కిన్నెరసాని అభయారణ్యంలో తునికాకు సేకరణ మొదలైంది. గిరిజనులు ఆకు సేకరించి ఆరబెడుతున్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 39° / 26°

జిల్లాలో శనివారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకపూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణంపై పోటీలకు ఆహ్వానం

చుంచుపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై పోటీలు నిర్వహిస్తున్నట్లు పర్యావరణ శాఖ ఇంజనీర్ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పనితీరు పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, నీటి సంరక్షణ తదితర అంశాలపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, ఆస్పత్రులు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, కళాశాలలు, పాఠశాలలు పోటీల్లో పాల్గొనవచ్చని వివరించారు. జూన్ 5న హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో ఉన్న తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆడిటోరియంలో 1వ, 2వ, 3వ బహుమతులు ఇస్తామని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

పరిశ్రమల భద్రతాధికారుల సమావేశంలో ఎస్పీ రోహిత్

కొత్తగూడెంఅర్బన్: భారత్‌–పాకిస్తాన్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో పరిశ్రమల యాజమాన్యాలు, భద్రతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల భద్రతాధికారులతో శుక్రవారం ఎస్పీ తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అశ్వాపురం భారజల కర్మాగారం, సారపాక ఐటీసీ, కేటీపీఎస్, బీటీపీఎస్, నవ లిమిటెడ్ కంపెనీల భద్రతాధికారులు, సంబంధిత పోలీసు అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్న నియమ నిబంధనలను పాటించాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. అలారం సిస్టమ్ విధానంపై కంపెనీల ఉద్యోగులు, వారి కుటుంబాలు, చుట్టుపక్కల ప్రాంతాల వారికి అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల ప్రవేశ ద్వారాల వద్ద ఇతర వ్యక్తులు లోనికి ప్రవేశించకుండా పకడ్బందీగా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగతనాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేసుకుని పోలీస్‌శాఖకు సహకరించాలని కోరారు. భారజల కేంద్రం కమాండెంట్ అమిత్ కుమార్, డీఎస్పీలు రవీందర్‌రెడ్డి, సతీష్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, అశోక్ రెడ్డి, ఐటీసీ సెక్యూరిటీ ఆఫీసర్ మనీష్ శర్మ, కేటీపీఎస్, బీటీపీఎస్ అసిస్టెంట్ కమాండెంట్లు చంద్రశేఖర్, తిరుపతి పాల్గొన్నారు.

ప్రసాద్ నిధులు పర్ణశాలకు..



పర్ణశాల కుటీరం

- భద్రాచలంలో రూ.7 కోట్లతో కేంద్ర పథకం పనులు
- రాష్ట్ర ప్రభుత్వ మాస్టర్ ప్లాన్‌తో పనులు నిలిపివేత
- ఆ నిధుల నుంచి రూ. 4 కోట్లు పర్ణశాలకు కేటాయింపు
- చివరిదశలో భద్రాచలం రెస్టారెంట్ నిర్మాణ పనులు
- డార్మెటరీ జీ ప్లస్–2 పనులు ఇంకా నత్తనడకనే..



స్టేడియంలో జరుగుతున్న ఓపెన్ షెడ్ పనులు

భద్రాచలం: భద్రాచలం, పర్ణశాలలో కేంద్ర ప్రభుత్వం, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రసాద్ పనులు ఎట్టకేలకు ఊపందుకున్నాయి. కేంద్రం 'పిల్‌గ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిర్చువల్ అగ్మెంటేషన్(ప్రసాద్) పథకంలో రూ.7 కోట్లతో పనులు చేపట్టింది. భద్రాచలంలో మూడింటిలో రెండు చోట్ల పనులు వేగవంతంగా నడుస్తుండగా, మరో చోట పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ముందుకు సాగడంలేదు. పర్ణశాలలో కూడా భవన నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. తాజాగా పర్ణశాల అభివృద్ధికి మరో రూ. 4 కోట్లు మళ్లించారు.

భద్రాచలం నిధులు పర్ణశాలకు మళ్లింపు

తొలుత భద్రాచలం ఆలయ ప్రాంగణంలో రూ.7 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మాస్టర్ ప్లాన్‌లో ఆ పనులను చేర్చటంతో ప్రసాద్ పథకం పనులు నిలిపివేశారు. ఆ పనులకు కేటాయించిన నిధులను భద్రాచలంలో ఇతర చోట్ల, పర్ణశాల ఆలయ అభివృద్ధికి వినియోగించేలా అనుమతులను ఇవ్వాలని టూరిజం శాఖ అధికారులు విన్నవించగా కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో రూ. 3 కోట్లతో భద్రాచలంలో రెండు చోట్ల గోదావరి ముంపు నుంచి రక్షణగా నిర్మాణాల ఎత్తు పెంచేందుకు కేటాయించనున్నారు. మిగిలిన రూ. 4 కోట్లతో పర్ణశాల ప్రధాన ఆలయంలో ఓపెన్ షెడ్ నిర్మాణం, ఫ్లోరింగ్‌ను గ్రానైట్ రాయితో అందంగా మలిచే పనులు చేపట్టనున్నారు. మరో రూ. 10 లక్షలతో విద్యుత్ దీపాల పనులు, ఫ్యానులు ఇతర పనులను చేపట్టనున్నారు. ఇటీవల టెండర్ ప్రక్రియ పూర్తికాగా, మరో రెండు రోజుల్లో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించనున్నారు.

మూడోసారి కొనసాగింపు

స్టేడియం వెనుక రెండెకరాల్లో చేపట్టిన భవన నిర్మాణ గడువు అనేకమార్లు పొడిగింపు అనంతరం 2024 డిసెంబర్ వరకు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ పేర్కొన్నారు. అయినా పూర్తికాలేదు. మరోసారి పొడిగింపునకు టూరిజం అధికారులు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. జూన్, 2025కు పూర్తి చేస్తామని పేర్కొంటున్నా ఆ పరిస్థితులే కనిపించటం లేదు. ఇక మిథిలా స్టేడియంలో నవమికి ముందే పూర్తి కావాల్సిన ఓపెన్ షెడ్ పనులు ఇంకా సాగుతున్నాయి. నెలాఖరులోగా పూర్తయ్యే అవకాశం ఉంది.

వేగంగా పనులు

భద్రాచలంలో ప్రసాద్ పథకం పనులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్ విధానంలో ప్రారంభించారు. మిథిలా స్టేడియం వెనుక భాగంలో ఉన్న రెండెకరాల స్థలంలో జీ ప్లస్ 2లో యాత్రికులకు గదులు, వ్రత మండపం, అన్నప్రసాద మండపం హాల్, బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న 1.20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో రెస్టారెంట్, పర్ణశాలలో మరో భవన నిర్మాణ పనులు 2023 మే నుంచి పనులు చేస్తున్నారు. 2024 జూలై 30వ తేదీ వరకు గడువు నిర్దేశించగా అప్పటికీ పనులు పూర్తికాలేదు. దీంతో బ్రిడ్జి సెంటర్‌లో, పర్ణశాలలో నిర్మాణ పనులను నిబంధనల మేరకు మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అప్పటి నుంచి పనులు వేగవంతమయ్యాయి. రెస్టారెంట్ పనులు చివరి దశలో ఉన్నాయి. పెయింటింగ్ నడుస్తుండగా, గ్రీనరీ ఇతర పనులను పూర్తి చేసి మరో నెల రోజుల్లో దేవస్థానానికి అప్పగిస్తామని టూరిజం ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

పర్ణశాల టెండర్లు ముగిశాయి

రూ. 4 కోట్లతో పర్ణశాల ఆలయ అభివృద్ధికి ఇటీవల టెండర్లు ముగిశాయి. భద్రాచలంలో ఆగిపోయిన పనుల నిధులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను పూర్తి చేశాం. మరో రెండు రోజుల్లో పనులను కాంట్రాక్టర్‌కు అప్పగిస్తాం. ఇక భద్రాచలంలో జరిగే పనులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తి చేస్తాం.

– ప్రసాద్, ఏఈ, టూరిజం శాఖ

పత్రికా స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం..



అమరవీరుల స్తూపం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

- జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, రాజకీయ నాయకుల హెచ్చరిక
- సాక్షి ఎడిటర్ ఇంట్లో పోలీసులతో సోదాలు సరికాదు
- ఏపీ ప్రభుత్వ తీరును ఎండగట్టిన పాత్రికేయులు
- జిల్లా కేంద్రంలో ప్లకార్డులతో నిరసన, ప్రదర్శన

కొత్తగూడెంఅర్బన్: పత్రికా స్వేచ్ఛను హరిస్తే ఊరుకోబోమని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తూ రాజకీయ ఒత్తిళ్లతో విజయవాడలోని సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో ఎలాంటి అనుమతులు లేకుండా పోలీసులు సోదాలు చేయడాన్ని నిరసిస్తూ జర్నలిస్టులు, అన్ని జర్నలిస్ట్ యూనియన్లు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొత్తగూడెంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద, బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. పోస్టాఫీస్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ముందస్తు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా సాక్షి ఎడిటర్ ఇంట్లో పోలీసులు సోదాలు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా అభివర్ణించారు. ఏపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించాలని చూస్తోందని, ఇటువంటి చర్యలను అన్ని వర్గాలు ఖండించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే పత్రికలను ఎవరూ అడ్డుకోలేరని, అడ్డుకున్న వారంతా చరిత్రలో లేకుండా పోయారని గుర్తుచేశారు. పోలీసులతో సోదాలు చేయించి భయపెట్టాలని చూస్తే అవివేకమే అవుతుందన్నారు. నిజాలను నిర్భయంగా రాస్తున్న సాక్షి దినపత్రిక స్వేచ్ఛను ఎవరూ అడ్డుకోలేరన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల స్టాఫర్లు తాండ్ర కృష్ణగోవింద్, రాజేందర్, లక్ష్మణ్, డి.వెంకటేశ్వర్లు, షఫీ, అశోక్, కురుమిళ్ల శంకర్, ఉదయ్, శ్రీనివాస్, ఈశ్వర్, జర్నలిస్టు సంఘాల నాయకులు ఇమంది ఉదయ్ కుమార్, రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు యెర్రా కామేష్, గొని నాగేశ్వరరావు, అంతోటి నాగేశ్వరరావు, కోటా శివశంకర్, వాసం రామకృష్ణ దొర, జర్నలిస్టులు జునుమల రమేష్, వాసాల శేఖర్, కృష్ణారావు, పి.రాము, అంతడుపుల శేఖర్, సాయి, తారక్, వీరు, ప్రవీణ్, రేశ్వంత్, రవి, అఫ్జల్, సుధాకర్, రాజ్ కుమార్, సూరి, మురళి, బుషేష్, సతీష్, శంకర్, రవీందర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అది ప్రజాస్వామ్యంపై దాడే..

ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో జరిగిన సోదాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు జైభీమ్ రావ్ భారత్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ తెలిపారు. జర్నలిస్టులు సామాజిక మార్పునకు మార్గదర్శకులని, చీకటిలో వెలుగులూదే దీపస్తంభాలని, ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధులని, అలాంటి జర్నలిస్టుల ఇళ్లలో సోదాలు చేయడం సరికాదని అన్నారు.

ఇది ప్రజాస్వామ్య భవితవ్యంపై దాడి అని, ఇలాంటి వాటిని దేశంలోని విలువలపై దాడిగా భావించాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఖరులపై ప్రశ్నలు వేయడం జర్నలిస్టుల బాధ్యత అని అన్నారు. ధైర్యంగా నిజాన్ని వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులను భయపెట్టే ప్రయత్నాలు ఎప్పుడూ విఫలమవుతాయని అన్నారు. జేబీపీ తరఫున జర్నలిస్టుల న్యాయ పోరాటానికి తాము అండగా ఉంటామని, స్వేచ్ఛ కోసం పోరాడే ప్రతి పత్రికా ఉద్యోగికి సంఘీభావం ఉంటుందని పేర్కొన్నారు.

‘సీతారామ’లో పూడిక తీయాలి

- జూన్ 15లోగా ప్రధాన కాలువ పూడిక పనులు పూర్తి చేయాలి
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పాసేజ్ పిల్లర్ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

ములకలపల్లి/దమ్మపేట/అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : సీతారామ ఎత్తిపోతల పథకం (ఎస్‌ఆర్‌ఎల్‌ఐపీ)లో నిర్మించిన 100 కి.మీ. ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పూడిక (సిల్ట్)తొలగించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ములకలపల్లి మండలంలోని మెయిన్ కెనాల్‌పై 48.30 కి.మీ. వద్ద కూలిన పాసేజ్ పిల్లర్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. భూమి పొరల్లో మార్పుల వల్ల పిల్లర్ నేలమట్టమయిందని సీఈ శ్రీనివాస రెడ్డి మంత్రికి విన్నవించారు. అనంతరం రామచంద్రాపురం శివారులో ప్రధాన కాలువపై నిర్మిస్తున్న వంతెనను సందర్శించారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలో నిర్మాణ దశలో ఉన్న సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్, కాలువ, ప్రాజెక్ట్ మ్యాప్‌ను పరిశీలించారు. అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపు పంచాయతీ అన్నదైవం రెవెన్యూ పరిధిలో తొమ్మిదో ప్యాకేజీ రూ. 357 కోట్లతో నిర్మిస్తున్న కాలువ పనులను పరిశీలించారు. కాలువ లైనింగ్, ట్రూప్ అక్విడెక్ట్ నిర్మాణాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సూపర్ పాసేజ్‌కు ప్రమాదం వాటిల్లకుండా సపోర్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. సంబంధిత ఏజెన్సీలతోనే మళ్లీ పిల్లర్ నిర్మించాలని చెప్పారు.

కాలువల్లో జమ్మి, మట్టి తొలగించాలి

నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న కాలువల్లో జమ్మి, మట్టి తొలగించాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో జూన్ 15లోగా పూడిక పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గోదావరిలో నీటిమట్టం పెరిగేలోగా మెయిన్ కెనాల్ శుభ్రం చేయాలన్నారు. మరో నాలుగు నెలల్లో జిల్లా వ్యవసాయ రంగానికి సీతారామ ప్రాజెక్ట్ కాలువ ద్వారా గోదావరి జలాలు అందించనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు, రవాణాలో తీవ్ర జాప్యం జరుగుతోందని పలువురు రైతులు విన్నవించగా, సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు శ్రీనివాసరెడ్డి, విద్యాచందన, దామోదర్ రెడ్డి, మధు, సురేష్, కృష్ణార్జునరావు, రాంబాబు, సతీష్, గుడ్ల పుల్లారావు, గద్దె రేవతి, కాంగ్రెస్ నాయకులు తాండ్ర ప్రభాకర్‌రావు, పర్వతనేని అమర్‌నాథ్, పువ్వాల మంగపతి, కరుటూరి కృష్ణ, బాల అప్పారావు, గాడి తిరుపతిరెడ్డి, కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్ పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అశ్వారావుపేటలో పర్యటించనున్నారు. స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేసిన శంకుస్థాపన, బహిరంగ సభ కార్యక్రమాలకు హాజరుకానున్నారు. మండలంలోని తిరుమలకుంట, అచ్యుతాపురం, కావడిగుండ్ల, అశ్వారావుపేటకు విద్యుత్ సబ్ స్టేషన్లకు శంకుస్థాపన చేయనున్నారు. ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ట్రాన్స్‌కో ఏడీఈ వెంకట రత్నం, కాంగ్రెస్ నాయకుడు జూపల్లి రమేష్ పర్యవేక్షించారు.

చంద్రుగొండలో పర్యటన రద్దు

చంద్రుగొండ : మండలంలోని బెండాలపాడు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన రద్దయినట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిర గిరి సౌరజల వికాస్ పథకం ప్రారంభించాల్సి ఉందని, మరో వారం రోజుల్లో పర్యటన ఉంటుందని పేర్కొన్నారు.

ధాన్యం 42 కేజీల తూకం పెడితే చర్యలు

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్
- సోములగూడెం కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్..



అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు మొలకెత్తిన ధాన్యం చూపుతున్న రైతు

పాల్వంచరూరల్: నిబంధనల మేరకు 40 కేజీలు మాత్రమే తూకం వేయాలని, ధాన్యాన్ని 42 కేజీల తూకం వేస్తే చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ హెచ్చరించారు. ‘తరుగు..తంటాలు ’శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అదనపు కలెక్టర్ స్పందించారు. మండల పరిధిలోని సోములగూడెం గ్రామశివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం నిల్వలను పరిశీలించారు. ధాన్యం అధిక తూకంపై రైతులను ఆరా తీశారు. ఆ సమయంలో కేంద్రం నిర్వాహకులు కాంటా వేయడం నిలిపివేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. 42 కేజీల అదనపు తూకంవేస్తే సస్పెండ్ చేస్తామని సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు. లిఖిత పూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

మొలకెత్తిన ధాన్యం చూపిన రైతులు

కొనుగోలు కేంద్రంలో నిల్వచేసిన ధాన్యం ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి మొలకలు వచ్చాయని బాధిత రైతులు శేఖర్, బాబారావు తదితరులు అదనపు కలెక్టర్‌కు చూపించి ఆవేదన చెందారు. కొనుగోళ్లలో జాప్యంతోనే ఇలా జరిగిందని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, విద్యుత్ సరఫరాకు సరైన చర్యలు తీసుకోవాలని, మరో ప్యాడీ క్లీనర్ ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. అదనపు కలెక్టర్ వెంట డీటీ శ్రీనివాసరావు, సొసైటీ కార్యదర్శి శ్రీను ఉన్నారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

పరిశ్రమల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని పరిశ్రమలు సహకరించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సింగరేణి, కేటీపీఎస్, బీటీపీఎస్, నవభారత్, ఐటీసీ, టీజీఎఫ్‌డీసీ పరిశ్రమల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమల సీఎస్సార్ నిధులపై ఈ నెల 15లోగా నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. పరిశ్రమలు పరిసర ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలన్నారు. సీఎస్‌ఆర్ నిధులు 20 శాతం స్థానిక అవసరాలకు, 80 శాతం ఇతర అవసరాలకు కేటాయిస్తామని చెప్పారు. నవభారత్‌లో తయారయ్యే ఇటుకలు కేవలం రూ. 6కు విక్రయిస్తున్నారని, వాటిని ప్రభుత్వ కట్టడాలకు, అభివృద్ధి పనులకు ఉపయోగించాలన్నారు. జిల్లాలో 27 వేల ఎకరాల్లో రైతులు జామాయిల్ సాగు చేపట్టారని, జామాయిల్ ఆకుల ద్వారా ఆయిల్ తయారీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్టికల్ 275 ద్వారా జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఆపరేషన్ థియేటర్లు, మార్చురీలు తదితర నిర్మాణాలను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఆస్పిరేషన్ జిల్లా అభివృద్ధిలో భాగంగా గ్రంథాలయాలలో పుస్తకాలు, ఫ్యాన్లు, లైట్లు వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ విద్యాచందన, అధికారులు సంజీవరావు, భాస్కర్‌నాయక్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరాచారి, తిరుమలేష్, నళిని పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు సతమతం!

- జిల్లాలో 191 టీచర్, 960 హెల్పర్ పోస్టులు ఖాళీ
- ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్న ఐసీడీఎస్ శాఖ
- టీచర్లు, ఆయాలపై పెరుగుతున్న పనిభారం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు చదువు చెబుతున్న టీచర్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో టీచర్లు, హెల్పర్లపై పనిభారం పడుతోంది. జిల్లా వ్యాప్తంగా 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 191 టీచర్, 960 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్నేళ్లుగా టీచర్లు, హెల్పర్లు లేని కేంద్రాలను ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందడంలేదు. గర్భిణులు, బాలింతలకు టీచర్లు సలహాలు, సూచనలు కూడా ఇవ్వలేకపోతున్నారు.

టీచర్లు, హెల్పర్లపై అదనపు భారం

అంగన్‌వాడీ సెంటర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నడుస్తాయి. లబ్ధిదారులకు అందించే సరుకులు, గృహ సందర్శన వివరాలు నమోదు చేసేందుకు రిజిస్టర్లు ఉపయోగిస్తున్నారు. గత ప్రభుత్వం టీచర్లకు స్మార్ట్ ఫోన్లు ఇచ్చింది. వీటిల్లో సుమారు 10 వరకు యాప్‌లు పొందుపరిచారు. వివరాలను రిజిస్టర్లు, యాప్‌లలో కూడా నమోదు చేయాల్సి ఉంటుంది. టీచర్లు, హెల్పర్లు అంగన్‌వాడీ కేంద్రంలో విధులతోపాటు వైద్యారోగ్యశాఖ కార్యక్రమాల్లోనూ పాల్గొనాలి. బూత్ లెవల్ అధికారులుగా ఎన్నికల విధులు కూడా నిర్వర్తించాలి. దీంతో పనిభారం తట్టుకోలేక సతమతమవుతున్నారు. కేంద్రాల నుంచి ఇంటికి వెళ్లాక కూడా పనిచేయాల్సి వస్తోందని వాపోతున్నారు. కొన్ని స్మార్ట్‌ఫోన్లు కూడా పనిచేయడంలేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇతర కేంద్రాలకు ఇన్‌చార్జిలుగా నియమించడంతో ఏ కేంద్రానికీ న్యాయం చేయలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఖాళీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించింది. దీంతో నిరుద్యోగులైన మహిళా అభ్యర్థులు నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందని అని ఎదురు చూస్తున్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేస్తే లబ్ధిదారులకు మెరుగైన సేవలందే అవకాశం ఉంది.

ఉన్నతాధికారులకు నివేదించాం



పోస్టులు ఖాళీలున్న కేంద్రాల్లో ఇన్‌చార్జ్‌లను నియమించాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇక ఖాళీల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

–స్వర్ణలత లెనీనా, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

క్లుప్తంగా

ఐటీడీఏ ఏసీఎంఓగా రమేష్



నియామకపత్రం అందజేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ అకడమిక్ అండ్ కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారి (ఏసీఎంఓ)గా టి.రమేష్‌ను నియమిస్తూ ఐటీడీఏ పీఓ బి.రాహుల్ శుక్రవారం నియామక పత్రం అందజేశారు. గతంలో ఏసీఎంఓగా డిప్యుటేషన్‌పై పనిచేసిన టి.రమణయ్య ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో దుమ్ముగూడెం మండలం గౌరారం ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న టి.రమేష్‌ను డిప్యుటేషన్‌పై నియమించారు. నెల రోజులపాటు రమేష్ ప్రస్తుత ఏసీఎంఓ వద్ద శిక్షణ పొంది అనంతరం బాధ్యతలు స్వీకరిస్తారని పీఓ తెలిపారు.

సింగరేణి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ప్రొఫెసర్ జయశంకర్ మైదానంలో శుక్రవారం ఇంటర్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ క్రికెట్ టోర్నమెంట్–2025 ప్రారంభమైంది. డైరెక్టర్ (పీపీ అండ్ పా) కె. వెంకటేశ్వర్లు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. బెల్లంపల్లి, రామగుండం, కొత్తగూడం రీజియన్లలో పనిచేస్తున్న అధికారులు మూడు జట్లుగా, కార్పొరేట్‌లో పనిచేస్తున్న అధికారులను మరో జట్టుగా ఏర్పడి పోటీల్లో పాల్గొంటున్నారు. కొత్తగూడెం జీఎం ఎం.శాలేంరాజు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వలేదంటూ నిరసన



మాచినేనిపేటతండా పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

జూలూరుపాడు: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వలేదంటూ శుక్రవారం మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రధాన గేటుకు మహిళలు తాళం వేసి నిరసన తెలిపారు. రేకుల ఇల్లు, పూరిల్లు ఉన్న వారికి, వితంతువులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా అనర్హులకు ఇచ్చారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేకులు, పూరిల్లు ఉన్న వారి పేర్లు మొదటి లిస్టులో వచ్చాయని, ఆ తరువాత తమ పేర్లు మాయం చేశారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ జ్యోతి విధుల్లో ఉండగానే కార్యాలయ ప్రధాన గేటుకు మహిళలు తాళం వేసి బైఠాయించారు.

ఖమ్మంలో ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

ఖమ్మం మయూరిసెంటర్: ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్క ర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర నాలుగో మహా సభలను ఖమ్మంలో నిర్వహించాలని నిర్ణయించి నట్లు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో గుండు మాధవరావు అధ్యక్షతన శుక్రవా రం జరిగిన మహాసభల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమాల ఖిల్లా అయిన ఖమ్మంలో ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ మహాసభల నిర్వహణకు నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రాల శ్రీని వాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులందరూ సభల జయప్రదానికి సహకరించాలని కోరారు. అనంతరం సభల ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడిగా కళ్యాణం వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పిట్టల సుధాకర్, కోశాధికారిగా గుగ్గిళ్ల రోశయ్యను రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్ ప్రతిపాదించగా ఆమోదించారు. ఈ సమావేశంలో సీఐటీయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ తదితర సంఘాల నాయకులు తుమ్మ విష్ణువర్ధన్, అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, వై.విక్రం, పిట్టల రవి, కుడుదుల వెంకన్న, తోకల బాబు, పగిళ్లపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

రండి.. డిగ్రీలో చేరండి

'దోస్త్'రిజిస్ట్రేషన్లు ప్రారంభం

- ఈనెల 21వరకు మొదటి విడత..
- ఆతర్వాత మరో రెండు విడతలు కూడా..
- ఉమ్మడి జిల్లాలోని 11 ప్రభుత్వ కాలేజీల్లో 5,820 సీట్లు



కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఖమ్మంసహకారనగర్: ఇంటర్‌మీడియట్ ఫలితాలు వెల్లడయ్యాయి. ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడిసిన్ కోర్సుల్లో విద్యార్థులు ఆ వైపు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. అయితే, కాలం మారుతున్నా వన్నె తగ్గని డిగ్రీ కోర్సుల్లోనూ చేరేందుకు ఇంకొందరు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. దీంతో ప్రభుత్వం ఏటా మాదిరిగానే డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా రిజిస్ట్రేషన్ల షెడ్యూల్ విడుదల చేసింది. ఇప్పటికే మొదటి విడతల షెడ్యూల్ అమల్లో ఉన్న నేపథ్యాన ఉమ్మడి జిల్లాలో డిగ్రీ కళాశాలలు, సీట్లు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ వివరాలపై కథనం.

2వ తేదీన నోటిఫికేషన్

రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం షెడ్యూల్‌ను ఈనెల 2వ తేదీన విడుదల చేసింది. ఈనెల 3వ తేదీ నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్లు మొదలుకాగా, డిగ్రీ బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీబీఎం తదితర కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థులు నేరుగా దోస్త్ వెబ్‌సైట్‌లోనే కాక మీ సేవ, దోస్త్ యాప్, ఆన్‌లైన్ సర్వీసెస్‌లోనూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మూడు విడతలుగా కొనసాగే ప్రవేశాల ప్రక్రియ కోసం విద్యార్థులు తమకు ఇష్టమైన కళాశాల, కోర్సును ఎంచుకోవాల్సి ఉంటుంది. ఖమ్మం జిల్లాలో ఐదు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలే కాక పలు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు కూడా ఉన్నాయి.

మూడు విడతల్లో ఇలా...

- 'దోస్త్'మొదటి విడత రిజిస్ట్రేషన్ ఈనెల 3వ తేదీన మొదలుకాగా, 21వ తేదీ వరకు రూ.200 రుసుంతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 10నుంచి 22వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశముండగా, 29వ తేదీన మొదటి విడత సీట్లు కేటాయిస్తారు. ఆయా విద్యార్థులు ఈనెల 30నుంచి జూన్ 6తేదీ వరకు కళాశాలల్లో రిపోర్టింగ్ చేసి నిర్దేశిత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- రెండో విడత రిజిస్ట్రేషన్‌కు రూ.400 ఫీజు చెల్లించాలి. ఈనెల 30నుంచి జూన్ 8వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉండగా, ఈనెల 30నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకుంటే అదే నెల 13న సీట్లు కేటాయిస్తారు. ఈ విడతలో సీట్లు దక్కిన విద్యార్థులు వచ్చే నెల 13 నుంచి 18వ తేదీ వరకు ఫీజు చెల్లించాలి.
- మూడో విడత రిజిస్ట్రేషన్‌లోనూ రూ.400 ఫీజుతో వచ్చే నెల 23న ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అదేరోజు నుంచి వచ్చే నెల 28వ తేదీ వరకు రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. కాగా, 1, 2, 3 విడతల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులంతా జూన్ 24 నుంచి 28వ తేదీల్లో ఆయా కళాశాలల్లో జరిగే ఓరియెంటేషన్ కార్యక్రమాల్లో పాల్గొని, 30న ప్రారంభమయ్యే తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, సీట్ల సంఖ్య

కళాశాల	సీట్లు
ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్, ఖమ్మం	1,560
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖమ్మం	480
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిర	300
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నేలకొండపల్లి	300
జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, సత్తుపల్లి	480
శ్రీరామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కొత్తగూడెం	360
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాల్వంచ	660
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భద్రాచలం	780
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇల్లెందు	300
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మణుగూరు	360
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అశ్వారావుపేట	240

రిజిస్ట్రేషన్‌కు ఏమేం కావాలి?

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ సమయాన ఇంటర్ ద్వితీయ సంవత్సరం హాల్‌టికెట్ నంబర్, ఆధార్‌కార్డు జిరాక్స్, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబర్, ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు 6నుంచి ఇంటర్మీడియట్ వరకు స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఇంటర్ టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో కూడా సమర్పించాలి.

సద్వినియోగం చేసుకోవాలి



డిగ్రీలో ప్రవేశాల కోసం విద్యార్థులు 'దోస్త్'వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మూడు విడతలుగా అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్‌లోనే నచ్చిన కాలేజీ, కోర్సును ఎంచుకోవచ్చు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.డీ.సలీంపాషా, దోస్త్ కో ఆర్డినేటర్, ఖమ్మం

తునికాకు సేకరణ షురూ..

జిల్లాలో సేకరణ లక్ష్యం 35,100 స్టాండర్డ్ బ్యాగులు



కిన్నెరసాని అభయారణ్యంలో తునికాకు సేకరిస్తున్న గిరిజన మహిళ



సేకరించిన తునికాకు కట్టలు కడుతున్న గిరిజనులు

పాల్వంచరూరల్: కిన్నెరసాని అభయారణ్యంలో గత గురువారం నుంచి తునికాకు సేకరణ మొదలైంది. ఈ ఏడాది జిల్లాలో తునికాకు సేకరణ లక్ష్యం 35,100 స్టాండర్డ్ బ్యాగులుగా నిర్దేశించారు. పాల్వంచ డివిజన్ పరిధిలో 2,300 స్టాండర్డ్ బ్యాగులు, కిన్నెరసాని అభయారణ్యం డివిజన్‌లో 3,200, కొత్తగూడెం డివిజన్‌లో 3,900, ఇల్లెందు డివిజన్‌లో 10,600, భద్రాచలం డివిజన్‌లో 9,700, మణుగూరు డివిజన్‌లో 5,400 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరించాల్సి ఉంది. కిన్నెరసాని అభయారణ్యం, పాల్వంచ రేంజ్ పరిధిలో రెండు రోజుల నుంచి గిరిజనులు తునికాకు సేకరిస్తున్నారు. కాగా అకాల వర్షాల కారణంగా కొన్ని యూనిట్లలో సేకరణ ఇంకా ప్రారంభంకాలేదని సమాచారం. ప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి వారం నుంచే తునికాకు సేకరణ జరుగుతుంది. ఈసారి పది రోజులు ఆలస్యంగా సేకరణ ప్రారంభమైంది. జిల్లాలో వేసవిలో చేపట్టే తునికాకు సేకరణను గిరిజనులు మూడో పంటగా భావిస్తారు. సెలవులు కావడంతో పలువురు విద్యార్థులు ఆకు సేకరణకు వెళ్తారు. 50 ఆకుల కట్టకు రూ.3.34 చొప్పున ప్రభుత్వం కాంట్రాక్టర్ల ద్వారా కొనుగోలు చేస్తుంది. తునికాకు సేకరణతో వచ్చిన నగదును గిరిజనులు పిల్లల చదువులకు, ఇతర కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్‌మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాల్లో 50 రోజులపాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్(గణిత శాస్త్రం)లో కనీసం 60 శాతం మార్కులు, ఐటీఐ డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్), డిప్లమా (సివిల్), బీటెక్ సివిల్ లేదా సమానమైన అర్హత కలిగినవారు దరఖాస్తు చేసుకోవచ్చొన్నారు. మీ సేవా కేంద్రాల ద్వారా రూ 100 చెల్లించి ఈ నెల 17 వరకు దరఖాస్తులు పొందవచ్చని, దరఖాస్తుకు చివరి తేదీ మే 17వ తేదీ అని వివరించారు. ఓసీ అభ్యర్థులకు రూ. 10వేలు, బీసీ అభ్యర్థులకు రూ. 5వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,500 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

ఇల్లెందు ఏరియా ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న ఆహారం పరిశీలన



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు (ఇన్ సెట్) కూర పరిశీలిస్తున్న సభ్యురాలు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్సు బృందం సభ్యులు, అడిషనల్ డైరెక్టర్ శాస్త్రి, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇ.తిరుపతి తనిఖీ చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న ఆహారం తీరుపై తనిఖీలు చేపట్టారు. వంట ఏజెన్సీ అందించే ఆహారంలో ఆకుకూరలు, పప్పు, సాంబార్, మజ్జిగ, కూరగాయలు, టీ వంటివి అందుతున్నాయా? లేవా ? అనే కోణంలో పరిశీలించారు. ఆహారం రుచి చూశారు. రికార్డులు తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మెనూ అమలు, ఆహారంలో పోషక విలువల శాతం, కిచెన్ షెడ్‌లో పరిశుభ్రత, ఆహార దినుసుల నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. ఇక్కడి రోగులకు ఇచ్చే ఆహారాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆర్‌ఎంఓ డాక్టర్ రాంనివాస్‌ను, రోగుల పట్ల శ్రద్ధ వహించాలని నర్సింగ్ సూపరిడెంట్‌ను ఆదేశించారు. ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ హర్షవర్ధన్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయ విద్యతో ఉపాధి అవకాశాలు



విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న డీన్ హేమంత్ కుమార్

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ విద్యతో ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తాయని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి వ్యవసాయ కళాశాల 34వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ కళాశాల ఎంతో మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించిందని అన్నారు. అనంతరం విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. ఆ తర్వాత విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పూర్వ విద్యార్థి విత్తనాల కంపెనీ ఎండీ మన్నెపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల లక్ష్యాన్ని పూర్తి చేయాలి

ఈజీఎస్ ఏపీడీ నల్లబోతుల రవి



ఇంకుడు గుంత నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈజీఎస్ ఏపీడీ రవి

అశ్వారావుపేటరూరల్: ఇంకుడు గుంతల నిర్మాణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఈజీఎస్ ఏపీడీ నల్లబోతుల రవి అన్నారు. శుక్రవారం మండలంలోని నారంవారిగూడెం కాలనీ, అశ్వారావుపేటలో ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రం, పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చేపట్టిన ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 24,050 ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసే విధంగా లక్ష్యాన్ని పెట్టుకున్నామని, ఇప్పటిదాకా 5343 గుంతల నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 1,22,732 మంది రైతులకు చెందిన 3,46,286 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఈ భూముల్లో 34,628 నీటి కుంటలను ఏర్పాటు చేసేలాచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతుల పొలాల్లో నిర్మించే చిన్న నీటికుంటకు రూ.3 లక్షలు, పెద్ద నీటికుంటకు రూ.4 లక్షలు కేటాయించామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రామచంద్రరావు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: మైనర్ బాలికకు వివాహం చేసిన ఘటనలో పోలీసులు శుక్రవారం ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న బాలిక (16)కు అదే గ్రామానికి చెందిన బొల్లం లింగరాజుతో గురువారం పెద్దమ్మగుడి వద్ద శ్రీరామా ఫంక్షన్‌హాల్‌లో వివాహం జరిపించారు. కౌన్సెలింగ్ ఇచ్చినా ఇరు కుటుంబాలు పట్టించుకోకుండా బాలికకు వివాహం చేశారని ఐసీడీఎస్ అధికారి శారద పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వివాహం చేసుకున్న బొల్లం లింగరాజు, అతని తల్లిదండ్రులు యలమంచి, లింగమ్మ, బాలిక తల్లిదండ్రులు బాలిన రాజు, సునీతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ. సురేష్ తెలిపారు.

సింగరేణిలో అధికారుల సెలవులు రద్దు

సింగరేణి(కొత్తగూడెం): దేశంలో నెలకొన్న పరిస్థితులు, పౌర రక్షణ దృష్ట్యా అధికారులు కచ్చితంగా పని ప్రదేశంలోనే ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం శుక్రవారం సంస్థ వ్యాప్తంగా తమ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేసింది. సెలవులో ఉన్న అధికారులు కూడా తక్షణమే విధుల్లో చేరాలని అందులో వెల్లడించింది.

74 కిలోల గంజాయి సీజ్




వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో శుక్రవారం ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అధికారులు రూట్ వాచ్‌తో పాటు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కారు, ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ఎండు గంజాయి తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నారు. సుమారు రూ. 40 లక్షల విలువైన 74 కిలోల గంజాయితోపాటు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణ చేపట్టి నిందితులు రాజస్థాన్‌కు చెందిన అనిల్ కుమార్, ముకేశ్ కుమార్, పాల్వంచకు చెందిన లావుడ్యా దుర్గా ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేష్ తెలిపారు.

మరో ఘటనలో 29.50 కేజీలు..

కారులో హైదరాబాద్‌కు తరలిస్తున్న 29.50 కేజీల గంజాయిని శుక్రవారం కూనవరం రోడ్డులోని ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయి, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 14.50 లక్షలు ఉంటుందని అంచనా. నిందితులు, ఏపీలోని కడపకు చెందిన సాయి కృష్ణ, పవన్ కుమార్ రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన శ్రీహరిని అరెస్ట్ చేసినట్లు భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహీమున్నిసా బేగం తెలిపారు.

38 మంది మావోయిస్టుల లొంగుబాటు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 38 మంది సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ రోహిత్ రాజు వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న పునరావాస సౌకర్యాలకు ఆకర్షితులై, కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవనం గడపాలని నిర్ణయించుకుని మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు వివిధ కేడర్లలో పని చేసిన 265 మంది మావోయిస్టులు కొత్తగూడెం పోలీసు ఎదుట లొంగిపోయారని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ ఆదివాసీ ప్రజల్లో ఆదరణ, నమ్మకం కోల్పోయిందని, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటోందని ఆరోపించారు. కొందరు అమాయక ఆదివాసీలను పోలీసు ఇన్‌ఫార్మర్ల పేరుతో అతికిరాతకంగా హత్య చేస్తున్నారని, హింసిస్తున్నారని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు పునరావాసం, జీవనోపాధి కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మావోయిస్టు అగ్ర నాయకులు జనజీవన స్రవంతిలో కలిస్తే ప్రత్యేకమైన నగదు, ఇతర పునరావస సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లొస్తూ ఐటీసీ కార్మికుడు మృతి



మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీ కొత్తూరు, సీతారాంపురం గ్రామాల మధ్య మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జోగులపాడు గ్రామానికి చెందిన మద్ది నరేష్(35) సారపాకలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ ఐటీసీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. బూర్గంపాడు మండలం టేకులచెరువు గ్రామానికి చెందిన యువతితో నరేష్‌కు వివాహం జరిగింది. రాత్రి డ్యూటీ చేసి ఉదయం మణుగూరులో బంధువుల పెళ్లికి వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో బీజీ కొత్తూరు, సీతారాంపురం గ్రామాల మధ్య మణుగూరు వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌ను ఢీకొట్టగానే నరేష్ పక్కకు పడిపోగా, బైక్ లారీ టైర్ల మధ్య ఇరుక్కుపోయింది. లారీ అలాగే ఈడ్చుకుపోవడంతో మంటలు వ్యాపించాయి. దీంతో వాహనదారులు భయాందోళన చెందారు. స్థానికులు నీళ్లతో మంటలు ఆర్పారు. ఎస్సై మధుప్రసాద్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా మణుగూరులో ఉన్న కుటుంబసభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. ఇప్పుడే మాట్లాడావు అప్పుడే చనిపోయావా అంటూ రోదించారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

మణుగూరు టౌన్: మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చిక్కుడుగుంటలో శుక్రవారం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. వీఆర్ పురానికి చెందిన కమ్మిశెట్టి సురేశ్ (40) మణుగూరులోని చిక్కుడుగుంటలో పదేళ్లుగా కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వివాహం జరగలేదని తరచూ మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఎస్‌ఐ రంజిత్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కలుపుమందు తాగి..

దమ్మపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో కలుపు మందు తాగిన వ్యక్తి, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని ఎర్రగుంపు గ్రామానికి చెందిన గడ్డం బాబు(34) కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం రాత్రి మద్యం మత్తులో కలుపు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

అదుపు తప్పి వాగులో పడిన లారీ

ఏన్కూరు: ఇసుక తీసుకెళ్తున్న లారీ అదుపుతప్పి వాగులో బోల్తాపడిన ఘటన ఇది. భద్రాచలం నుండి ఇసుకతో బయలుదేరిన లారీ ఏన్కూరు మండలం జన్నారం మీదుగా ఖమ్మం వెళ్తోంది. ఈక్రమాన గురువారం అర్ధరాత్రి జన్నారం సమీపంలో అదుపు తప్పి వాగులో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అయితే, వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.